క్లుప్తంగా

వివాహ వేడుకకు ఎమ్మెల్యే హాజరు


పాల్గొన్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని వడూర్ మాజీ సర్పంచ్ గాదె సమత– గాదె శంకర్ కుమార్తె వివాహ వేడుకలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేశ్ హాజరయ్యారు. సోమవారం బోథ్ మండల కేంద్రంలోని పరిచయ గార్డెన్‌లో జరిగిన ఈ వివాహ వేడుకల్లో నూతన వధూవరులను ఆశీర్వదించారు.

వాగులో సేద తీరుతున్న పశువులు


వాగులో పశువులు

తాంసి: రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్నందున తాగునీటికి పశువులు అల్లాడుతున్నాయి. కొద్దిపాటి నీరు కనిపించినా.. దాహార్తి తీర్చుకొని, చల్లగా సేద తీరుతున్నాయి. సోమవారం మత్తడివాగు పక్కన ఉన్న సుంకిడి శివారులో మేతకు వెళ్లిన పశువులు వాగులో చల్లదనం కోసం సేద తీరుతూ కనిపించాయి.

బీఆర్‌ఎస్‌లో చేరిక

నేరడిగొండ: మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త ఉత్తమ్ సింగ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కిష్టాపూర్ మాజీ సర్పంచ్ సోలంకి గీతా కరణ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన


మాట్లాడుతున్న టీచర్

ఖానాపూర్: పట్టణంలోని బర్కత్‌పుర అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం కాలనీవాసులకు అంగన్‌వాడీ టీచర్ వరలక్ష్మి బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. నిర్ణీత వయసు రాకుండా పెళ్లి చేస్తే 2006 చట్టం ప్రకారం రెండేళ్లు జైలుశిక్ష లేదా రూ.లక్ష జరిమానా చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా చైల్డ్ మ్యారేజ్ చేస్తే డయల్ 100తోపాటు 1098, 181 నెంబరుకు సమాచారం ఇవ్వాలని.. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షికోత్సవం

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్, సుర్జాపూర్ ఎస్సీ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత మాట్లాడారు. 5 ఏళ్ల లోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పూర్వప్రాథమిక విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీచర్లు ఊర్మిళ, సులోచన, సరస్వతి, వైశాలి, రమ ఉన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ఖానాపూర్: మండలంలోని బీర్నంది జడ్పీహెచ్‌ఎస్‌తోపాటు గోసంపల్లె బ్రిలియంట్ స్కూల్, ఖానాపూర్‌లోని ఏసీఈ స్కూల్, బీర్నంది వాసు విద్యాలయాలకు చెందిన విద్యార్థులు కరాటేలో ప్రతిభ కనబరిచి పలు రకాల బెల్టులు అందుకున్నారని కరాటే మాస్టర్ మచ్చ మనోహర్ తెలిపారు. ఖానాపూర్ పట్టణంలోని బాలాజీ రైస్‌మిల్లు ఆవరణలో ఈ కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆరెంజ్, ఎల్లో, గ్రీన్, మెరూన్ బెల్టులతోపాటు ప్రశంసా పత్రం, ఐడీ కార్డులు అందజేశామని పేర్కొన్నారు. బీర్నంది జెడ్పీఎస్‌ఎస్‌కు చెందిన నాగ చైతన్య మెరున్‌బెల్ట్, విశ్వంత్, శివకుమార్, ప్రవళిక, ఆరెంజ్‌బెల్ట్.. బీర్నంది వాసు విద్యాలయం ఎం.అక్షర్ గ్రీన్‌బెల్ట్, గోసంపల్లె బ్రిలియంట్ స్కూల్‌కు చెందిన శ్రావణి, చరణ్‌తేజ్, యుక్తిక, ఆరెంజ్ బెల్ట్, లాస్య, సురక్షిత్, మనిసాకేత్, వరుణ్, ఎల్లో బెల్ట్, ఏసీఈ స్కూల్ కావ్య ఆరెంజ్ బెల్ట్, తేజస్విని ఎల్లో బెల్ట్ సాధిచారని పేర్కొన్నారు.

జోరుగా 'ఉపాధి' పనులు

- చెరువులు, కుంటల్లో పూడికతీత
- పెరగనున్న భూగర్భజలాలు
- నల్లమట్టిని పంటచేలలో వేసుకుంటున్న రైతులు


చేనులో వేసుకున్న చెరువు పూడికతీత మట్టి


పొన్నారి చెరువులో మట్టిని తవ్వుతున్న ఉపాధి కూలీలు

తాంసి: ఉపాధిహామీ పథకంలో భాగంగా ఆయా గ్రామాల్లోని చెరువుల్లో, నీటి కుంటల్లో పూడికతీత పనులు జోరుగా సాగుతున్నాయి. దీంతో ఉపాధి కూలీలకు పూర్తిస్థాయిలో పని లభిస్తుంది. చెరువుల్లో కందకాలు తవ్వి మట్టిని తీయడం ద్వారా భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉంది. అలాగే రైతులు పూడిక మట్టిని పంట చేలలో వేసుకుంటున్నారు. వేసవిలో కూలీ దొరకని సమయంలో ఉపాధిహామీ పనుల ద్వారా ఎంతో లబ్ధిచేకూరుతోంది. పంట చేలలో వేసుకోవడం ద్వారా నేల స్వభావం పెరిగి, పంటలకు కావాల్సిన పోషకాలు మట్టిలో పుష్కలంగా ఉంటాయి. పంట ఎదుగుదలకు సైతం దోహద పడుంతుంది.

ఆయా గ్రామాలో పనులు..

మండలంలోని తాంసి, జామిడి, వడ్డాడి, కప్పర్ల, పొన్నారి, సావర్గాం, గిరిగాం, అంబుగాం, హస్నాపూర్‌తో పాటు అట్నంగూడ గ్రామాల శివారులో చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు జోరుగా సాగుతున్నాయి. చెరువులో పనులు సాగడంతో మట్టిని తీసుకెళ్లేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆయా గ్రామాల్లో నిత్యం వందల మంది ఉపాధి పనులకు వెళ్తున్నారు. వేసవిలో కూలీలకు చేతి నిండా ఉంటుంది. అలాగే చెరువులు కూడా అభివృద్ధి చెంది, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.

మట్టిని చేనులోకి తరలిస్తున్నాం



పంటల అధిక దిగుబడి కోసం చెరువు మట్టిని చేలలోకి తరలిస్తున్నాం. గతేడాది 15 ట్రాక్టర్ల మట్టిని తీసుకెళ్లాను. మట్టి వేయడం ద్వారా పంట దిగుబడి, తెగుళ్లు లేకపోవడంతో మట్టి వేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నాం. మరింత మంది కూలీలను పెంచితే రైతులు మట్టిని సులువుగా తరలించే అవకాశం ఉంది.

– సొదరి ఇస్తారి, రైతు, తాంసి

నీటి సామర్థ్యం పెరుగుతుంది



ఉపాధిహామీ పథకంలో ఎక్కువగా చెరువులు, కుంటల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యం ఇచ్చాం. ప్రస్తుతం ఏ గ్రామంలోని చెరువుల్లో నీరు లేక పోవడంతో పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే కూలీలకు మూడు వారాలకు పైగా పని కల్పించాం. పూడిక తీత ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది.

– విజయ, ఉపాధిహామీ ఏపీవో, తాంసి

చేతిపంపునకు మరమ్మతులు


చెలిమ నీటిని పరిశీలిస్తున్న అధికారులు

- చిన్నూగూడను సందర్శించిన అధికారులు
- నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

ఉట్నూర్‌రూరల్: మండలంలోని చిన్నుగూడ గ్రామాన్ని ఆర్‌డబ్ల్యూఎస్, ఐటీడీఏ అధికారులు సందర్శించారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన 'చిన్నుగూడలో నీటి గోస' కథనానికి స్పందించిన అధికారులు గ్రామాన్ని సందర్శించి నీటి సమస్యను అడిగి తెలుసుకున్నారు. చేతిపంపునకు మరమ్మతులు చేయించి గ్రామంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించారు. అలాగే ట్యాంకర్ ద్వారా నీరు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. అంతేకాకుండా భీంజీగూడ నుంచి పైప్‌లైన్ ద్వారా గ్రామానికి నీటి సరఫరాకు ప్రణాళికలు రూపొందించడం జరి గిందన్నారు. గ్రామాలను ఎప్పటికప్పుడు సందర్శిస్తూ సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి రమేశ్, జిల్లా పరిషత్ డి ప్యూటీ సీఈవో కాలిందిని, ఏటీడీవో క్రాంతి, ఎంపీవో లింగయ్య, ఈవో శంకర్ పాల్గొన్నారు.


చేతిపంపునకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

'జనజాతర'కు తరలిన నాయకులు

ఉట్నూర్‌రూరల్: జిల్లా కేంద్రంలోని డైట్ గ్రౌండ్‌లో తలపెట్టిన జనజాతర భారీ బహిరంగ సభకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో పాటు నియోజకవర్గంలోని కడెం, ఖానాపూర్, జన్నారం, దస్తురాబాద్, పెంబీ మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివెళ్లారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంపీ స్థానం గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖయ్యుం, ఎక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో సోమవారం నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డి సభకు మండల కేంద్రం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. నేరడిగొండ మండల కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు రాహిల్ మాలిక్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ మద్దతుగా విచ్చేస్తున్న సీఎంకు స్వాగతం పలకనున్నట్లు పేర్కొన్నారు. నాయకులు ఆడే వసంత్, నాయిడి రవి, శంకర్, యూత్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్, ప్రవీణ్, షేక్ ఇబ్రాహి, పాపన్న పాల్గొన్నారు.


ఎమ్మెల్యేతో కలిసి సభకు వెళ్తున్న నాయకులు

కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

ఇచ్చోడ: ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏలేటి అశ్విన్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సిరిచెల్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యకర్తలు, నాయకులు పార్టీ గెలుపు కోసం కష్టపడాలన్నారు. బీఆర్‌ఎస్, బీజేపీలు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీతోనే సుస్థిర పాలన అందుతుందన్నారు. ఆయన వెంట నాయకులు కొడప జాలైజాకు, కుంట ప్రవీన్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

నార్నూర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన జనజాతర సభలో సోమవారం పలువురు మంత్రి సీతక్క సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ప్రణీత బానోత్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలను చూసి, సామాజికవేత్త బానోత్ జాలంసింగ్ ఆశయ సాధన కోసం రాజకీయాలోకి వస్తున్నట్లు తెలిపారు. నార్నూర్, గాదిగూడ మండలాల్లో రైతులకు సాగునీరు, తాగునీరు అందాలంటే ఎంపల్లి చెరువుపై ప్రాజెక్టు అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి సుగుణ, ఆసిఫాబాద్ డీసీసీ విశ్వప్రసాద్, ఆసిఫాబాద్ ఇన్‌చార్జి శ్యాం నాయక్, పరమేశ్వర్, దత్తారాం రాథోడ్, తదితరుల పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏలేటి అశ్విన్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాల్లోనే పంట అమ్మాలి


జొన్న కొనుగోళ్లు ప్రారంభిస్తున్న అధికారులు

ఇంద్రవెల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే పంటను అమ్మి మద్దతు ధర పొందాలని పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ధరంసింగ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో జొన్న కొనుగోళ్లను ప్రారంభించారు. రైతులు పండించిన పంటను దళారులకు అమ్మి ధరలో, తూకంలో మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సిబ్బంది తుమ్మల సునీల్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

గుడిహత్నూర్: అంబేద్కర్ ఆశయ సాధన కోసం కృషి చేద్దామని బంతే జీ సరిపుత్ర, అంబేద్కర్ మెమోరియల్ కమిటీ సభ్యులు సత్యవాన్ చిక్టే, రవి జాబాడే, శైలేందర్ వాఘ్మారే అన్నారు. మండలంలోని ముత్నూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు లహుదాస్ ససానే, విశ్వంబర్, సిద్ధార్థ్, రఘునాథ్, విట్టల్, సచిన్ జోందళే పాల్గొన్నారు.

28న ప్రవేశ పరీక్ష

ఉట్నూర్‌రూరల్: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి ఈనెల 28 ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపాల్ తక్షశీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

1 నుంచి సాఫ్ట్‌బాల్ శిక్షణ

నేరడిగొండ: మండల కేంద్రంలోని కుంటాలకు వెళ్లే రోడ్డు సమీపంలోని మైదానంలో మే 1 నుంచి 31వరకు ఉచిత సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరం ఉంటుందని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గస్కంటి గంగాధర్ ఆదివారం తెలిపారు. క్రీడాకారులకు సాఫ్ట్‌బాల్ మెలకువలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94935 35372 సంప్రదించాలని కోరారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నేరడిగొండ: నేరడిగొండ బీఆర్‌ఎస్ నుంచి భారీ ఎత్తున నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో సోమవారం జరిగిన జనజాతర సభలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మండల అధ్యక్షుడు వసంత్ రావు, ఏలేటి రాజారెడ్డిల ఆధ్వర్యంలో నేరడిగొండ మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శ్రీరామోజీ నారాయణ, కళ్లెం భోజన్న, ఆకుల వెంకటరమణలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్ కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ సమక్షంలో పార్టీలో చేరారు.

గుడిహత్నూర్: మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆడే శీల, మాజీ జెడ్పీటీసీ మాధవ్ మస్కే సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన సీఎం సభలో కాంగ్రెస్‌లో చేరారు. వీరికి సీఎం రేవంత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎంపీ అభ్యర్థి సుగుణను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంకతి రవీందర్, బాలాజీ సోంటక్కే, తదితరులు ఉన్నారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- మాజీ మంత్రి జోగు రామన్న
- పోస్ట్ కార్డు ఉద్యమానికి శ్రీకారం

ఆదిలాబాద్‌టౌన్: ప్రజలకిచ్చిన హామీలు, పథకాల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. హామీల అమలుపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని ప్రారంభించారు. రైతు భరోసా, కౌలు రైతులు, రైతు కూలీలకు ఆర్థిక సాయం, నాలుగు వేల పెన్షన్ హామీలను పోస్ట్‌కార్డుల్లో ప్రస్తావిస్తూ.. వాటిని సీఎం కార్యాలయానికి పంపించారు. ఆరు గ్యారంటీలలోని పదమూడు పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. రెండు వందల యూనిట్‌ల లోపు ఉచిత విద్యుత్, రూ.500కే వంట గ్యాస్ సిలిండర్ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని విమర్శించారు. కల్యాణలక్ష్మి కింద ఇస్తామన్న తులం బంగారం సంగతేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ప్రజలే తగిన గుణపాఠం చెప్తారన్నారు. కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కుమార్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టుకార్డులను ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

నీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఇంద్రవెల్లి: గ్రామాల్లో నీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్‌డీవో సాయన్న అన్నారు. సోమవారం మండలంలోని కేస్లాపూర్, హర్కపూర్, ఆంద్‌గూడ, హర్కపూర్‌తండా, కొలాంగూడ, మామిడిగూడ గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్యను పరిశీలించారు. గిరిజనులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మామిడిగూడలో రెండు రోజులుగా ఏర్పడిన విద్యుత్ అంతరాయం కారణంగా నీటి సమస్య ఏర్పడిందని గ్రామస్తులు తెలిపారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి విద్యుత్‌ను పునరుద్ధరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భాస్కర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, అర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుకుమార్, తదితరులు పాల్గొన్నారు.


గిరిజనులతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో సాయన్న

చేసిన సేవలతోనే గుర్తింపు

గుడిహత్నూర్: ఉద్యోగి తన విధుల్లో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని జిల్లా విద్యాధికారి ప్రణీత అన్నారు. మండలంలోని మన్నూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల బయోసైన్స్ ఉపాధ్యాయుడు పోటుకర్ రమేశ్ ఉద్యోగ విరమణ సభకు హాజరై మాట్లాడారు. ప్రతీ ఉద్యోగి తన జీవిత కాలాన్ని విధుల్లో వెచ్చించడం జరుగుతుంది. ఆసమయంలో వారు అందించిన సేవలతో గుర్తుండి పోతారని తెలిపారు. రమేశ్ అందరి మనుసులు గెలుచుకున్నారని వారి శేష జీవితం హాయిగా కొనసాగాలని కోరుకున్నారు. అనంతరం రమేశ్ దంపతులకు స్థానిక పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఇచ్చోడ, గుడిహత్నూర్ ఎంఈవోలు ఉదయ్‌రావ్, నారాయణ, స్థానిక హెచ్‌ఎం సంతోష్, పాఠశాల సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


రమేశ్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బంది

మగిసిన బాజీరావు బాబా సప్తాహం

తాంసి: మండలంలోని జామిడి గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న బాజీరావు బాబా సప్తాహం ముగిసింది. సోమవారం బాజీరావు బాబా శిష్యులు హరిపాట్, గీతాపారాయణం భక్తులకు చదివి వినిపించారు. ఆనంతర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే గ్రామస్తులు మంగళహారతులతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. గ్రామపెద్దలు బాజీరావు బాబా శిష్యు లు మహేందర్ రెడ్డి, ఎంపీటీసీ అశోక్, మాజీ సర్పంచ్ కేశవరెడ్డి, రఘురెడ్డి, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.


శోభాయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

బేల: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మండలంలోని బోరిగాం గ్రామంలో అడనేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.9 లక్షల వ్యయంతో నిర్మించిన హనుమాన్ ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడనేశ్వర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయం నిర్మించడం అభినందనీయమన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో అనేక ఆలయాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. దేవుడి పేరు చెబుతూ రాజకీయ పబ్బం గడుపుకునే ప్రయత్నాలు చేయడం ఎట్టి పరిస్థితుల్లో సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ సతీష్ పవార్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రావుత్ మనోహర్, ఠాక్రే గంభీర్, జక్కుల మధుకర్, ఓల్లఫ్వార్ దేవన్న, తన్వీర్‌ఖాన్, రాథోడ్ రోహిదాస్, చరణ్‌దాస్, మెంతెం దత్తు, ప్రతాప్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న

బీఆర్‌ఎస్ నాయకుల ఎన్నికల ప్రచారం

ఆదిలాబాద్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును ఎంపీగా గెలిపించాలని ఎంపీపీ గండ్రత్ రమేశ్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని వాన్‌వాట్ కొలాంగూడలో నాయకులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. కరపత్రాలు, స్టిక్కర్లను అందజేసి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందన్నారు. పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఆరె నరేశ్, మంచు ఆశన్న, మల్లేష్, మాధవ్ బుచ్చన్న, జైరామ్, భూమన్న, జలపతి పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు